# మొదలైన వినాయక నిమజ్జనాల సందడి

**ట్యాంక్‌బండ్, సరూర్‌నగర్ చెరువు వద్ద భక్తుల రద్దీ**

**నిమజ్జనం కోసం కొలనులు, బేబీపాండ్స్ వద్ద జిహెచ్ఎంసి ఏర్పాట్లు**

**హుస్సేన్‌సాగర్ వద్ద ఏర్పాట్లు పరిశీలించిన నగర సిపి సివి ఆనంద్**



హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త: గణేష్ నవరాత్రి ఉత్సవాలు మొదలై మూడురోజులు అవుతుందని దీంతో నగరంలో గణేష్ నిమజ్జనాల సందడి మొదలైంది. దీంతో బుధవారం నగరంలోని ట్యాంక్‌బండ్, సరూర్ నగర్ మినీట్యాంక్‌బండ్‌తో సహా జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొలనులు, పాండ్ల వద్ద నిమజ్జన సందడి నెలకొంది. ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లు, చిన్న చిన్నగల్లీల్లో పెట్టిన గణేష్ విగ్రహాలను మూడోరోజు నుంచి నిమజ్జనాలకు తీసుకువచ్చారు. దీంతో నిమజ్జన వేడుకల్లో చిన్నారులు, యువతీ యువకుల సందడి కలిపించింది. కాగా నిమజ్జనానికి జిహెచ్ఎంసి పరిధిలో 74 కొలనులను వినాయక నిమజ్జనాలకు సిద్ధం చేశారు. నగరంలోని 30సర్కిళ్లలో ప్రస్తుతం ఉన్న 28 బేబిపాండ్స్‌తో పాటు అదనంగా మరో 46 ప్రాంతాల్లో తాత్కాలిక పోర్టబుల్ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో ఈఏడాది 90వేల వినాయక మండపాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి విగ్రహాల సంఖ్య 25శాతం ఎక్కువగా ఉందంటున్నారు. అలాగే 28వ తేదీన మహా నిమజ్జనం జరగనుంది. దీని కోసం ట్యాంబండ్‌పై ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రెండు భారీ క్రేన్లు ట్యాంక్‌బండ్‌పైకి చేరుకున్నాయి. ఏగణేష్‌ను ఎక్కడ నిమజ్జనం చేయాలో అధికారులు ముందే నిర్ణయించారు. నిమజ్జనానికి సంబంధించిన రూట్‌మ్యాప్ నిర్వాహకులకు ముందే ఇచ్చారు. దీనివల్ల నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని భావిస్తున్నారు. పక్కా ఏర్పాట్లతో నిమజ్జనం సజావుగా జరిగేందుకు చర్యలు చేపడుతున్నారు.

**ఏర్పాట్లు పరిశీలించిన సిపి ఆనంద్..** గణపతి నిమజ్జనాలకు పలు శాఖల అధికారులతో కలిసి పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. బుధవారం మూడోరోజు కావడంతో నిమజ్జనాలు మొదలయ్యాయి. ఈనేపథ్యంలో నగర సిపి సివి ఆనంద్ ఉన్నతాధికారులతో కలిసి హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాలోన్ల పర్య టించారు. సాగర్‌తోపాటు జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న చెరువులోన్ల సుమూరు 50వేల విగ్రహాలు నిమజ్జనం అవుతాయని భావిస్తున్నట్లు తెలిపారు. తెలుగు తల్లి ఫ్లైఓవర్, ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా ప్రాంతాల్లో మూర్పులు రావడంతో అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం, అమవీరుల స్థూపం మార్గాల్లో స్వల్ప మూర్పులు ఉంటాయని తెలిఏపారు. హుస్సేన్‌సాగర్‌కు వచ్చే రహదారుల్లో యూటర్నులు, వంతెనల ఎత్తులు, విగ్రహాల అనుమతిపై సమీక్షించచిన సిపి ..క్రేన్ల ఏర్పాట్లపై కూడా అధికారులతో చర్చించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.




## నేడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతి



సమావేశంలో అభివాదం చేస్తున్న దాసు సురేష్

సైఫాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: జలదృశ్యం వేదికగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ 11వ వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 21వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు జలదృశ్యం వద్దగల ఆయన విగ్రహం ఎదుట నిర్వహిస్తున్నామని బిసి రాజ్యాధికార సమితి తెలిపింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ తొలి, మలి దశ ఉద్యమకారులు, బాపూజీ సహచర నాయకులు, అభిమానులు, తెలంగాణ సామాజిక వేత్తలు, మేధావులు, కవులు, కళాకారులు, విద్యార్థి నాయకులు పాల్గొంటారని చెప్పారు.

## మహిళా రిజర్వేషన్లలో బిసిలకు సబ్‌కోటా కేటాయించాల్సిందే

**వివిధ బిసి మేధావులు, అడ్వకేట్, మహిళా సంఘాల డిమాండ్**



అభివాదం చేస్తున్న ప్రభంజన్‌యాదవ్, వంగారాములుగౌడ్, నరేందర్‌గౌడ్,లక్ష్మీ, సూర్యారావు తదితరులు

హైదరాబాద్, సెప్టెంబరు 20,ప్రభాత వార్త: కేంద్రప్రభుత్వం తెచ్చిన మహిళ రిజర్వేషన్ బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా కేటాయించాల్సిందేనని వివిధ బిసి మేధావులు,అడ్వకేట్, మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌కన్లబ్‌లో బిసి సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి బిసి మేధావుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు వంగ రాములుగౌడ్, బిసి యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు పాలూరి రామకృష్ణయ్య, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, బిసి సమాజ్ అధ్యక్షులు సంగెం సూర్యారావు తదితరులు హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా వంగారాములుగౌడ్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశంలోని మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని తాము స్వాగతిస్తున్నాని అయితే 1996 సంవత్సరంలో పార్లమెంట్‌లో వీగిపోయిన బిల్లును ఎటువంటి సవరణలు,మార్పులు చేయకుండా ఎస్సీ,ఎస్టీ,బిసి మైనార్టీలకులకు కోటా కల్పించకుండా యథాతథంగా ప్రవేశపెట్టారని దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బిసి సంక్షేమసంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ మహిళా బిల్లులో బిసిమహిళలు సబ్‌కోటా కేటాయించకుంటే ఆబిల్లులో సార్థకత ఉండదన్నారు. ఈకార్యక్రమంలో ఎంబిసి సంక్షేమసంఘం అధ్యక్షులు బెక్కం వెంకట్, సాగరా బేగం,హిందు బిసి మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్, నగిరి ప్రవీణ్‌కుమార్, జాతీయ బిసి మహిళా సంఘం నేత రోజా, బిసి యునైటెడ్ ఫ్రంట్ పార్టీ అధ్యక్షురాలు పాలూరి లక్ష్మీ ,బిసి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నాగుల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్



వినాయక నిమ్జనం చేసే కోకాపేట్ కొత్త చెరువు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి

నార్సింగి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో వినాయకులను నిమజ్జనం చేసే కోకాపేట్‌లోని కొత్త చెరువు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం సాయంత్రం కమీషనర్ సురేందర్‌రెడ్డి సమీక్షించారు. సంబంధిత అధికారులు, సిబ్బందిని వెంట తీసుకెళ్లి గణపతి నిమజ్జనానికి ఎన్ని క్రేన్‌లు ఉపయోగిస్తున్నారు? ఎంత మంది సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు? భక్తులు నీటిలోకి రాకుండా ఎలాంటి ఏర్పాట్లు చేశారు? అన్న అంశాలపై కమీషనర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా కమీషనర్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ భక్తి,శ్రద్దల మధ్య జరుపుకునే గణపతి నిమజ్జనోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## మట్టి గణేశ నిమజ్జనం

ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : బంజారహిల్స్ రోడ్ నెంబర్ 12లో ఎన్ఎస్ఎల్ గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మట్టి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎల్ గ్రూప్ సిబ్బంది ఆధ్వర యంలో ఆ సంస్థ ఆవరణలోనే గణేష్ నిమజ్జనం జరగటం విశేషం. ఈ సందర్భంగా సంస్థ అసిస్టెంట్ మేనేజర్లు శేష కుమార్, సంతోష, ఎగ్జిక్యూటివ్ రాఘవేంద్రలు మాట్లాడుతూ యాజమాన్యం సహకారంతో పర్యావరణ పరిరక్షణ కోసం గత 15 సంవత్సరాలుగా మట్టి గణపతి తోనే పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రంగురంగుల వినాయకులను వాడటం మానేయాలని చెరువులు, కుంటులలో నిమజ్జనాన్ని ఆపి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని గణేష్ మహారాజ్‌కి జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం వినాయకుని నిమజ్జనం చేశారు.

## ధర్మకర్తల ఆలయ అభివృద్ధికి పాటుపడాలి : మంత్రి తలసాని



మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానిస్తున్న మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి దేవాలయం చైర్మన్ సంతోష్ యాదవ్

కంటోన్మెంట్,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: ధర్మకర్తలు ఆలయ అభివృద్ధికి పాటుపడాలని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీని వాస్ యాదవ్ తెలిపారు. మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయం పాలకమండలి ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ నెల 22న ఆలయంలో జరిగే శ్రీ లక్ష్మి గణపతి హోమం కార్యక్రమానికి హాజరు కావాలని ఆలయ చైర్మన్ చిరబోయిన సంతోష్ యాదవ్ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు చొల్లేటి రమేశ్, నాగేందర్ యాదవ్, భాస్కర్, ప్రధాన అర్చకులు టీ.రాజేశ్వర శర్మ, బిఆర్ఎస్ నాయకులు ఉమా శంకర్ పాల్గొన్నారు.

## మహాప్రస్థానంలో ముగిసిన జలగం వెంగళ్‌రావు సోదరుడు కెప్టెన్ రామారావు అంత్యక్రియలు



పాల్గొన్న భారత నావికాదళ అధికారులు.. అభిమానులు

ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : దివంగత మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సోదరుడు కెప్టెన్ జె.రామారావు అంత్యక్రియలు బుధవారం ఉదయం ఫిలింనగర్‌లోని మహాప్రస్థానంలో ముగిశాయి. జలగం వెంగళరావు కుమారుడు మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు అంతిమ దహన సంస్కారాలను నిర్వహించగా, భారత నావికాదళానికి చెందిన అధికారులు గౌరవ వందనం చేశారు. ఎమ్మెల్సీ భాను ప్రసాద్, రిటైర్డ్ ఇంటెలిజెన్స్ ఎస్పి కిషన్‌రావు, తదితరులు కెప్టెన్ రామారావుకు నివాళులు అర్పించారు. ఖమ్మం, వైజాగ్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి అభిమానులు హాజరై ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఇదిలా ఉండగా కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌గా, విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్‌గా, భారత నావికాదళంలో 32 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో పనిచేసిన జె.రామారావు ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్, సిఐఐ చైర్మన్‌గా, ప్రిజర్వేషన్ ఆఫ్ ఎన్విరాన్మెంట్ క్వాలిటీ జీవిత కాలపు అధ్యక్షునిగా, ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ ఫౌండర్ చైర్మన్‌గా కూడా వ్యవహరించారు. ఆయన చేసిన సేవలకు గాను 1972లో విశిష్ట సేవ మోడల్ కూడా లభించింది. విశాఖపట్నం నేవల్ ప్రాజెక్ట్ డీజీగా కూడా ఆయన నిధులు నిర్వహించారు. ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ సభ్యులు, పర్యావరణ వేత్తలు, ప్రకృతి ప్రేమికులు అంతిమ కార్యక్రమంలో పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## గాంధీ ఆస్పత్రిలో వైద్యుల ధర్నా




సికింద్రాబాద్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త : నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం వైద్యులకు అందజేయాల్సిన పీఆర్సీ ఎరియర్స్‌ని వెంటనే విడుదల చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యులు వైద్య గర్జన నిర్వహించడంతో పాటు అన్ని వైద్య సేవలను ఆపివేస్తామని వైద్య బృందం తెలిపింది. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో వైద్యులు దర్నా జరిపారు. టీజీజీడీఏ గాంధీ యూనిట్ ఆధ్వర్యంలో డాక్టర్ భూపేందర్ రాథోడ్ అధ్యక్షతన మహాధర్నా జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యుల చిరకాల డిమాండ్స్ అయిన పీఆర్సీ ఏరియర్స్, ఈఎల్ ఎంక్యాష్మెంట్ గురించి ప్రభుత్వాని నిలదీశారు. మహాధర్నాలో వివిధ మెడికల్ కాలేజీల టీజీజీడీఏ ఉద్యమనేతలు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఆండ్ హెల్త్, వైద్య విధానపరిషత్ ఆధ్వర్యంలో తోటి జీజీడీఏ ఉద్యమ నేతలు డాక్టర్ రమేష్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ లాలు ప్రసాద్, నరహరి, సుభోద్, వినోద్, రంగా, రవి, జానకి వైద్య బృదం పాల్గొన్నారు.

## అప్పుడే సంక్రాంతి పండుగకు వెయిటింగ్ లీస్ట్

తార్నాక, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త : సంక్రాంతి పడుగకు సొంతూళ్లకు వెళ్లాలను కునేవారికి ఈ సారి కూడా రైలు ప్రయాణం భారంగా కష్టతరంగా మారనుంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ జిల్లాల్లోని సొంతూళ్లకు వెళ్లాలను కూనే వారికి రిజర్వేషన్లు దొరకడంలేదు. రైల్లో ప్రయాణించాలను కూనే వారు రైలు రిజర్వేషన్ చేసుకుందాటం టే పండుగకు చాలా రోజుల ముందే చాలా రైళ్లలో దాదాపు వెయిటింగ్ లీస్టే కనిపిస్తోంది. జనవరి 11 నుంచి 14 వరకు రిగ్రేట్ చూపిస్తోంది. సికింద్రాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్నం మీదుగా వెళ్లాలను కునే వారికి ఎక్కువగా రిగ్రేట్ వస్తుంది. విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో,11,13 గరీభ్‌రథ్‌లో 12,13 తేదీలో, ఫలక్‌నూమా, గోదావరి, మహబూబ్‌నగర్, విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌లో 12,న కోణార్క్‌లో 13 వరకు రిగ్రేట్ కనిపిస్తోంది. విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో 12,13 తేదీల్లో రిగ్రేట్ వస్తుంది. అదేవిదంగా గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో 12న ప్రయాణానికి ఏసీ బోగీలల్లో రిజర్వేషన్లు అయిపోయినట్లు చూపిస్తున్నారు. 400లకు పైగా వెయిటింగ్ లిస్ట్ చూపిస్తుంది.

## ఒయు పునర్వైభవానికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం మరవలేనిది

**వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్**



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్

తార్నాక, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త : ఒ.యూ పునర్వైభవానికి ప్రభుత్వంతో పాటు పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం మరవలేనిదని ఒ.యూ వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. ఉత్తర అమెరికా ఒ.యూ పూర్వ విద్యార్థుల సంఘం(అలుమ్నీ) సహకారంతో ఆర్ట్స్ కళాశాలలో డా.జమాలుద్దీన్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఎన్ఆర్ఐలతో కలిసి వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద కోట్ల నిధుల సేకరణే లక్ష్యంగా పూర్వ విద్యార్థుల సమూహాన్ని బలోపేతం చేస్తానని చెప్పారు. ఒ.యూ ఇండియా స్టార్టప్ ఫెస్టివల్‌ను త్వరలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 20 కోట్లు అందాయన్నారు. మరో ముప్పై ఏళ్ల వరకు వసతి కోసం ఇబ్బందులు లేకుండా విద్యార్థి హాస్టళ్ల నిర్మాణం చేపడుతు న్నామని పేర్కొన్నారు. ఒ.యూ అభివృద్ధికి వైస్ చాన్సలర్ చేస్తున్న కృషిని ఎన్ఆర్ఐలు, పూర్వ విద్యార్థులు డా. వెంకట్ మారోజు, డా.రాయదాస్ మంథెన, డా.రవి ప్రకాష్ మారెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ సి.గణేష్, యూజీసీ వ్యవహారాల డీన్ ఆచార్య జి.మల్లేశం, ప్రొ.కాశీం. రాజనీతీ శాస్త్ర విభాగాధిపతి ప్రొ.చంద్రునాయక్, ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ డా. అనుపమ, డా.బాలునాయక్‌పాల్గొన్నారు.



శ్రీరామ నాటక నికేతన్, తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో బుధవారం రాత్రి జరిగిన తులసీదాస్ చరితం నృత్య నాటకంలో ఓ దృశ్యం

## మహిళా బిల్లుపై నగర మేయర్ హర్షం



ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడంతో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలకు పైగా పెండింగ్‌లో ఉన్న బిల్లును ప్రవేశపెట్టిడంతో సంతోషంగా ఉందని మేయర్ అన్నారు. ఈ బిల్లుతో మహిళలు కూడా రాజకీయ రంగంలో ముందు ఉంటారని, దేశ అభివృద్ధిలో తమవంతు పాత్రను పోషిస్తారని, మహిళా సాధికారిక సాధ్యమవుతుందని అన్నారు. మహిళా బిల్లు ఆమోదం పందటం దేశానికే గర్వకారణం అని తెలిపారు. ఈ బిల్లుకు నారిశక్తి అని నామకరణం చేయటం సంతోషమని మహిళలందరూ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కృషి ఎంతో ఉందని, మహిళల తరపున ఎమ్మెల్సీ కవితని కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

## స్వాగత ప్లెక్సీలు కడుతుండగా విద్యుత్‌షాక్.. ముగ్గురికి గాయాలు

కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలో పేదలకు అందజేస్తున్న డబుల్‌బెడ్‌రూమ్ ఫ్లాట్ల పంపిణీ కోసం రెండవ విడత లబ్దిదారులకు ఈనెల 21న రెండవ విడత పంపిణీ కార్యక్రమానికి స్వాగత సూచకంగా పెక్సీ కడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌తీగెలకు తగిలి ముగ్గురుకార్మికులు గాయాలకు గురైన సంఘటన ఈడిమెట్లపోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతల్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చింతల్ బస్టాప్‌లో కెటిఆర్ రాకను పురస్కరించుకుని మిట్టల్, దుర్గేష్, బాల్‌రాజ్, నాగనాథ్ అనే కార్మికులు ఫెక్సీలను స్థానిక బస్టాండ్ సమీపంలో ఫెక్సీలు కడుతున్నారు. విద్యుత్ స్థంబాల సమీపంలో ఫెక్సీలను కడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు ఫెక్సీ రాడ్‌లకు కరెండుతీగెలు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్‌తీగెలు తగిలి నలుగురుకార్మికులు విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. ఉదయం ఆరు గంటలసమయంలో సంఘటన జరగడంతో వెంటనే స్థానికంగా వున్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

## గణేశుని మండపం వద్ద విద్యుదాఘాతంతో ఇంటర్ విద్యార్థి మృతి

సైదాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: గణనాధుడి మండపం వద్ద విద్యుదాఘాతానికి గురై విద్యార్థి మృతి చెందిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సాయిరాంకాలనీకి చెందిన చిన్నసాయిలు కుమారుడు వర్ధన్ కుమార్(17) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కాలనీలో ఏర్పాటు చేసే గణనాధుడి మండపం వద్ద జరిగే కార్యక్రమాల్లో ప్రతి ఏటా వర్ధన్ కుమార్ చురుకుగా పాల్గొంటుంటాడు. ఈ నెల 18వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో గణనాధుడి మండపంపై ఉన్న కవర్ గాలికి ఎగురుతుండడం గమనించిన వర్ధన్‌కుమార్ ఇనుపతీగలతో కవర్‌ను కట్టడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఇనుపతీగలు పైన ఉన్న కరెంటు వైర్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఇది గమనించిన తోటి వారు వెంటనే వర్ధన్‌కుమార్‌ను దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## సబ్దార్‌నగర్‌లో జీహెచ్ఎంసి కమిషనర్, ఎమ్మెల్యే పర్యటన



సబ్దార్‌నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : నాలాల సమీపంలో ఇళ్లు నిర్మించుకున్న వారి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం నుండి వారికి డబల్ బెడ్రూమ్ ఇళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని శాసనసభ్యులు మాదవరం కృష్ణారావు అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్, సబ్దార్‌నగర్ ప్రాంతాల్లో నాలాలను, చెరువులను జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రోస్‌తో కలిసి పరిశీలించారు. సున్నం చెరువు నుంచి లక్ష్మీనగర్, సబ్దార్‌నగర్ వరకు నాలా ఆధునీకరించేందుకు కోట్లాది రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందని వర్షాకాలం స్థానికంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులు చేపడుతు న్నామన్నారు. నాలా అభివృద్ధిలో భాగంగా ఇళ్లు కోల్పోయిన వారికి డబల్ బెడ్రూమ్ ఇళ్లు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్, నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ గౌసుద్దీన్, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ రంజింత్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ మల్లేష్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల అయలయ్య, అబ్దుల్ హమీద్, సలీమ్, రఫిక్ పాలొన్నారు.

### విఘ్నేశ్వరుడు అందరిని చల్లంగా చూడాలి : సుష్మిత శంకరావు

బేగంపేట సెప్టెంబరు 20,ప్రభాతవార్త : విఘ్నేశ్వరుడు ప్రజలందరినీ చల్లంగా చూడాలని కంటోన్మెంట్ బీజేపీ నాయకురాలు డా.పి.సుష్మిత శంకరరావు అన్నారు.బుధవారం ఆమె కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని బాలంరాయిలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో పూజలు నిర్వహించారు. సుష్మితను సత్కరించి తీర్ధ ప్రసాదాలను అందించారు.

## స్థానికులకు 10శాతం ఇండ్లు 27న పంపిణీ చేస్తాం : ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి దుండిగల్‌లోని డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను స్థానికులకు 27న పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే వివేకానంద్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ గురువారం దుండిగల్‌లోని డబుల్ ఇండ్ల పంపిణీ మంత్రి కెటిఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. స్థానికులకు కేటాయించిన ప్రకారం 10శాతం అనగా సుమారు 300ఇండ్లను మొదటి విడతగా ఈనెల27న అందజేస్తామన్నారు. ఎటువంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. అందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని, విచారణ ప్రారంభించి ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

## తెలంగాణ రాష్ట్రం ఆధ్యాత్మికంగా ఉన్నతంగా ఉండే ప్రాంతం

**నగర పోలీసు కమిషనర్ సివి.ఆనంద్**



పోలీసుకమిషనర్ సివి.ఆనంద్‌ను సత్కరిస్తున్న బిజెవైఎం పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు గుండగౌని భరత్‌గౌడ్

చిక్కడపల్లి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ఆధ్యాత్మికంగా ఉన్నతంగా ఉండే ప్రాంతమని, ఇక్కడ ప్రతి ఒక్కరిలో భక్తిభావనలు వెల్లివిరుస్తాయని హైదరాబాద్ నగర పోలీసుకమిషనర్ సివి.ఆనంద్ అన్నారు. బుధవారం చిక్కడపల్లిలో బిజెవైఎం పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు గుండగౌని భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని కమిషనర్ సి.వి.ఆనంద్‌తో పాటు సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్ మండపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా ఉత్సవాలు నిలుస్తాయని, మనంప్రతి పండుగ జరుపుకుంటున్న సందర్భంలో మంచి విషయాలను ఆచరించి పాటిస్తే ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. ప్రతి ఒక్కరు ఏ కార్యక్రమం చేపట్టినా ఎలాంటి విఘ్నాలు లేకుండా సాగాలంటే వినయకుడిని పూజించాల్సిన అవసరం ఉంటుందని అన్నారు.

## నీలోఫర్ ఆసుపత్రిలో కిడ్నాప్ బాలుడి కథ సుఖాంతం

**పిల్లలు లేక పోవడంతోనే అపహరించామంటున్న నిందితులు**

**పోలీసుల అదుపులో నిందితులు**

**తల్లిదండ్రులకు బాలుడిని అప్పగింత**

మెహిదీపట్నం, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : నిలోఫర్ ఆసుపత్రిలో అపహరణకు గురైన ఆరు నెలల బాలుడి కథ సుఖాంతమైంది. గత 14వ తేదీన నిలోఫర్ ఆసుపత్రిలో ఫైజల్‌ఖాన్ అనే బాలుడు అపహరణకు గురైన విషయం విధితమే. బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నాంపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టి ఆరురోజుల తరువాత నిజామాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే నింధితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. గండిపేటలోని ఓ ఫాంహౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సన్మాన్ ఖాన్ - ఫరీదాబేగం దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారిడికి అస్వస్థ కావడంతో ఈనెల 14వ తేదీన ఉదయం నిలోఫర్ ఆసుపత్రికి తీసుకొచ్చి అడ్మిట్ చేశారు. దీంతో పెద్ద కుమారిడికి చికిత్స కొనసాగుతున్న సమయంలో చిన్న కుమారుడు ఫైజల్‌ఖాన్‌ను తల్లి పట్టుకొని మొదటి అంతస్తులో కూర్చొంది. అదే సమయంలో ఫరీదా బేగం దగ్గరకు వచ్చిన గుర్తు తెలియని మహిళ ఆమెతో సన్నిహితంగా మెలిగింది. ఇంతలో ఫరీదాబేగం భోజనం కోసం వార్డు నుంచి బయటకు వెల్లగా మొదటి అంతస్తులోనే ఆడుకుంటున్న ఫైజన్‌ఖాన్‌ను ఎత్తుకెళ్లింది. బోజనం తీసుకొని ఫరీదాబేగం అక్కడికి వచ్చి చూసే సరికి బాలుడు కనిపించక పోవడంతో అంధోళన చెందిన తల్లి చుట్టుపక్కల ఉన్నటువంటి వారిని అడగ్గా ఇప్పటి వరకు నీతో మాట్లాడిన మహిళనే నీబాలుడిని తీసుకెల్లిందని తెలిపారు. సన్నిహితంగా మెలిగిన మహిళనే బాలుడిని తీసుకెళ్తుండడంతో బంధువులు అయి ఉంటారని చెప్పుకొచ్చారు. ఫరీదాబేగం లబోదిబోమంటూ నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలుడి ఆచూకికోసం పోలీసులు ఆసుపత్రి అంతా వెతకగా ఎక్కడా కనిపించలేదు. ఎట్టకేలకు ఆరు రోజుల తరువాత నిజామాబాద్‌లో బాలుడు ఉన్నట్లు గుర్తించిన పోలీ సులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. తమకు పిల్లలు లేకపోవడంతో ఈ పనిచేశామని వివరించారని తెలిపారు. అపహరణకు గురైన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.

## కంటోన్మెంట్‌లో వెంకట్‌రావ్ సేవలు మరువలేనివి

**మర్రి రాజశేఖర్ రెడ్డి**



పారిశుద్ధ్య సిబ్బందికి దుసుస్తులు పంపిణీ చేస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి, నళిని కిరణ్, జక్కుల మహేశ్వర్ రెడ్డి తదితరులు

కంటోన్మెంట్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు ప్రజలకు బోర్డు మాజీ సభ్యుడు పి. వెంకట్ రావ్ సేవలు మరువలేనివని మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వెంకట్ రావ్ 69వ జయంతి పురస్కరించుకొని బుధవారం 4వ వార్డు కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కంటోన్మెంట్ ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ బోర్డులో పనిచేస్తున్న పారిశుద్ధ్య విభాగం సిబ్బందికి ఉచితంగా చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. వెంకట్ రావ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, దశరత్ రెడ్డి, సుషాంత్‌రెడ్డి, గంగారామ్ తదితరులు పెద్దల నర్సింహా పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

**ఇటుక శ్రీ కిషన్ మాదిగ**

అడ్డగుట్ట, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎసీ ్స వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌ఛార్జి ఇటుక శ్రీ కిషన్ మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద క్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు బుధవారం ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ఎసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ్లనే వర్గీకరణ బిల్లును ప్రవేశపెడుతామని హామీ ఇచ్చి 9 యేండ్లు గడుసస్తున్నా వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టలేదన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. లేని పక్షంలో తెలుగు రాష్ట్రాల్లోని మాదిగ పల్లెల్లో బిజెపి జెండా ఎగరనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజిత్ కళ్యాణ్, రవి మాదిగ, రాజశేఖర్ మాదిగ, రాజు మాదిగ, రాములు మాదిగ, నారాయణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం: మంత్రి తలసాని



జింఖానా గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ క్రీడా ముగింపు కార్యక్రమంలో క్రీడాకారులతో మంత్రి తలసాని

బేగంపేట సెప్టెంబరు 20,ప్రభాతవార్త : క్రీడలను ప్రోత్సహించడం యువ క్రీడాకారులకు చేయూత నిచ్చినట్లు అవుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా బెంగాల్ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించిన ఫుట్‌బాల్ క్రీడా ముగింపు కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వృత్తులను ప్రోత్సహించే విధంగా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని మంత్రి తలసాని అన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నిరంతరం పని వత్తిడిలో ఉండే స్వర్ణకారులు ఈ క్రీడల నిర్వహణతో అందరూ ఒకే చోట కల్సుకోవడం ఎంతో సంతోషాన్ని కల్గిస్తుందని, పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన మొదటి జట్టుకు 55వేలు, ద్వితీయ బహుమతి 40వేలురూపాయల నగదుతో పాటు షీల్డులను కూడా మంత్రి చేతుల మీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అబ్బుల్ పబ్బాప్రకాష్, సుమీర్, అబూతాహెర్, ఇంతియాజ్ ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో బిజెపి గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి

**కొరదాల నరేష్**



గణేష్ పూజల్లో పాల్గొన్న కొరదాల నరేష్

మూసాపేట, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ, వివేకానందనగర్, హైదర్‌నగర్ డివిజన్‌లలో వివిధ కాలనీల గణేష మండపాలలో బుధవారం డాక్టర్ కొరదాల నరేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో బిజెపి గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని గణేష్‌ని కోరుకున్నట్లు తెలియజేయశారు. ఈ సందర్భంగా ఆదిత్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన మహిళా సభ్యులందరితో డాక్టర్ నరేష్ మహిళలందరికీ 33శాతం రాజకీయాలలో మహిళల రిజర్వేషన్ కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ జనతా పార్టీ మహిళా పక్షపాతి పార్టీ, మహిళా సాధికారతతోనే దేశం అభివృద్ధి చెందుతుందని గుర్తించి ప్రధాని ఎన్నో సంవత్సరాలుగా చట్ట సభల్లో నానుతున్న మహిళకు 33శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం కల్పించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం శ్రీనాథు, వివేకానందనగర్ డివిజన్ జనరల్ సెక్రటరీ రాజు, భాస్కర్‌రెడ్డి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న కేంద్రం



నరేంద్రమోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : రాజకీయ చట్ట సభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం ఆమోదించిన సందర్భంగా బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి మహిళా మోర్చ అధ్యక్షురాలు పుడత లక్ష్మీ ఆధ్వర్యంలో కాటేదన్ బిజెపి కారా ్యలయం ఆవరణలో జరిగిన కార్యక్రమ ంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్ర పటానికి .మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు బిజెపి నాయకులు కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నదని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ మల్లేష్ యాదవ్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికే జనార్ధన్, మహిళ అధ్యక్షురాలు పుడతలక్ష్మ, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు విజయ్, బిజెపి నాయకులు లక్ష్మీ, భాగ్య, సువర్ణ, లత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైనేజి పనులను పరిశీలించిన కార్పొరేటర్



బండ్లగూడ కార్పొరేషన్‌లోని 7.వ,వార్డులో భూగర్భ డ్రైనేజి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావతి యాదవ్

నార్సింగి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని ఏడవ వార్డులో జరుగుతున్న భూగర్భ డ్రైనేజి పనులను స్థానిక కార్పొరేటర్ క్యాతం పద్మావతి పాపయ్య యాదవ్ బుధవారం పరిశీలించారు. రూ.33.లక్షలతో చేపడుతున్న డ్రైనేజి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించినట్లు కార్పొరేటర్ తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడడం లేదని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలు ఎక్కడున్నా అక్కడికెళ్లి సంబంధిత అధికారులను తీసుకువచ్చి పరిష్కరిస్తున్నామని తెలిపారు. మాపై ప్రజలు పెట్టుకున్న విశ్వాసాన్ని మరింత పెంచుకునేందుకు నిత్యం జనాల మధ్యనే ఉంటూ, వారి ఇబ్బందులు తొలగిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత పాపయ్య యాదవ్, ముజీవుద్దీన్, నదీం, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 20, ప్రభాత వార్త : ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోని ఖాజానగర్‌లో పది లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ కు తెలియజేశారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెట్టి కాలనీని సుందరంగా తీర్చిదిద్దుకోవాలని కాలనీ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, కైసర్, సుల్తాన్, అబ్దుల్ సలామ్, మహమూద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## సుల్తాన్‌బజార్ ఎసిపి డివిజన్ పరిధిలో పోలీసుల కవాతు



గన్‌ఫౌండ్రి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: వినాయక ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకుగాను పోలీసులకు ప్రజలు సహకరించాలని ఈస్ట్ జోన్ డిసిపి సునీల్‌దత్తు కోరారు. నగర పోలీసు కమీషనర్ సి.వి.ఆనంద్ ఆదేశాల మేరకు సుల్తాన్‌బజార్ ఎసిపి డివిజన్ పరిధిలోని అఫ్జల్‌గంజ్, సుల్తాన్‌బజార్, నారాయణగూడ పోలీసు స్టేషన్ల పరుధులో అదనపు పోలీసు బలగాలతోపాటు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ అదనపు బలగాలతో కలిసి ప్రధాన రహదారులల్లో పోలీసు కవాత్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవాలుప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు పోలీసులు రాత్రి, పగలు అనకుండ శ్రమిస్తున్నామన్నారు. అందుకు ప్రజలు శాంతి భద్రతలను కాపాడేందుకుగాను కుల, మతాలకు అతీతకంగా సహకరించాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ పరంగా కట్టు దిట్టమైన చర్యలు చేపడుతుందన్నారు. కవాతులో అదనపు డిసిపి పుధ్వీరావు, సుల్తాన్‌బజార్ ఎసిపి బాలగంగిరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సంతోషం, ముత్తు, అదనపు పోలీసులు పాల్గొన్నారు.

## డబుల్ ఇండ్ల పంపిణీ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యేలు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్‌లో గురువారం రెండవ విడత డబుల్ ఇండ్ల పంపిణీ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు పరిశీలించారు. లబ్దిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ ఇండ్ల పంపిణీలో లబ్దిదారులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## బోరబండలో ఫ్లాగ్ మార్చ్



యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో పశ్చిమ మండల డీసీపీ జోయల్ డెవిస్ ఆదేశాల ప్రకారం ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటేశ్వరరావు సూచనల మేరకు బుధవారం సాయంత్రం బోరబండ సైట్3 నుంచి బోరబండ పోలీస్ స్టేషన్ సిబ్బంది దాదాపు 70 మంది వరకు వినాయక చవితి మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా ప్రజల్లో సామాజిక భద్రతను, బరోసాను కల్పించటంలో భాగంగా ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. సైట్3 హైటెక్ హోటల్ నుంచి బాబా సైలానినగర్, భరత్‌నగర్, అంజయ్యనగర్, ఎస్ఆర్‌టీనగర్, రాజ్‌నగర్, సైట్5 మీదుగా బోరబండ బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోరబండ సీఐ కామల్ల రవికుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్, సబ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్, జమాల్, స్వప్నారెడ్డి, తుల్జారామ్ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ మేయర్‌ను కలిసిన మల్లాపూర్ ఆటో, టిప్పర్ అసోసియేషన్ నాయకులు



తార్నాక, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, టీటీయూసీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి లను మల్లాపూర్ ఆటో, టిప్పర్ అసోసియేషన్ నాయకులు తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వారు ఎదుర్కోంటున్న సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా మల్లాపూర్‌లోని ఆటో, టిప్పర్ డ్రైవర్లకు ప్రభుత్వం తరుపున ఇన్సూరెన్స్ తో పాటు పలు సమస్యలపై వారికి వినతిపత్రాన్ని అందజేశారు. అందుకు వారు స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూస్తానని పేర్కొన్నారు.

## గణపతి నవరాత్రోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**జెపి రాష్ట్ర నాయకుడు జిగ్నేష్ జోషి**

చిక్కడపల్లి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: గణపతి నవరాత్రోత్సవాలు ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని బిజెపి రాష్ట్ర నాయకుడు జిగ్నేష్ జోషి అన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా ఇటువంటి ఉత్సవాలు నిలుస్తాయని అన్నారు. బుధవారం అశోక్‌నగర్‌లోని స్థానిక అశోక్‌నగర్ యూత్ అసోసియేషన్ అధినేత డి.రమేశ్‌కుమార్ ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద జిగ్నేష్ జోషి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఏ.నర్సింగరావు, కె.ప్రణీత్, కిరణ్‌సాయి, ఎస్.సాయినాథ్, పి.సుజాత, ఎ.వినయ్, పి.అశోక్ తదితరులు పాల్గొన్నారు. అన్ని విఘ్నాలు తొలగి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

## గాంధీ మెడికల్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ కమిటీ నియామకం

సికింద్రాబాద్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: ఢిల్లీలోని నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చైర్మన్‌గా కళశాల ప్రిన్సిపాల్, డీఎంఈ డాక్టర్ రమేష్ రెడ్డి, సభ్యులుగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణ మోహన్, గాంధీఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రాజారావు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, విద్యార్థుల తల్లితండ్రులు, హాస్టల్ వార్డెన్‌లతో పాటు స్థానిక జర్నలిస్టుల తరపున ప్రతినిధిగా సీనియర్ జర్నలిస్ట్ కంద్రేటి శ్రీనివాస్ (సాక్షి)ను నియమించారు. ఈ కమిటీ ఏడాది పాటు విధులు నిర్వహిస్తుందని, గాంధీ వైద్య కళాశాలలో ర్యాగింగ్ నిరోధించడానికి సలహాలు, సూచనలు, చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## నేత్రపర్వంగా శ్రీకృష్ణరాయబారం పౌరాణిక పద్యనాటకం



సత్కారం పొందిన శ్రీకృష్ణరాయబారం పద్యనాటక కళాకారులను అభినందిస్తున్న అతిథులు

నాంపల్లి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : వినాయక చవితి నవ రా త్రో త్స వా లను పురస్కరించుకొని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు నిర్వహించిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీ చోడేశ్వర నాట్యమండలి వారిచే శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్యనాటకం అద్భుతంగా ప్రదర్శింపబడింది. ప్రధానపాత్రలు శ్రీకృష్ణుడుగా సిహెచ్.శూలపాణి, దుర్యోధనుడు సిహెచ్.బాలనాగేశ్వరరావు, అర్జున బి.నారాయణ, ధృతరాష్ట్ర వి.సూర్యప్రకాష్, కర్ణ మల్లాది వెంకటరమణ, భీష్మ స్వర్ణశ్రీనివాస్, ద్రోణ మల్లాది గోపాలకృష్ణ, అశ్వద్ధామ పి.మంగపతిరావు, గాంధారి పి.సావిత్రి తదితరులు వారిపాత్రల్లో జీవించి అద్భుతంగా నటించి ఆహుతులకు నేత్రపర్వం కావించి ఆధ్యాత్మికమార్గంలో విహరింపజేశారు. కురుక్షేత్రం, ఋషికేష్ హరిద్వార్, గోరక్‌పూర్, పశుపతినాథ దేవాలయాల్లో కూడా ప్రదర్శించడం విశేషం కాగా ఈ నాటకాన్ని శృతి సంస్కృతి సమాఖ్య కూచిభట్ల రామేశ్వరశాస్త్రికి అంకితమిచ్చారు.

## పండుగులను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలి



వినాయక పూజల్లో పాల్గొన్న లింగ్విస్టిక్‌సెల్ నాయకులు మురళీమోహన్‌సింగ్ తదితరులు

అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: కలసిమెలసిగా అందరు పండుగులను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని బాలభక్తసమాజ్ అధ్యక్షులు, లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ నాయకులు, మురళీ మోహన్‌సింగ్ అన్నారు. వినాయక ఉత్సవాల భాగంగా చిన్నబజార్‌లోని బాలభక్త సమాజ్‌ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వినాయక పూజలు చేశారు.

## ఉద్యమకారులకు కానుకలు స్వాగతిస్తున్నాం

సైఫాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: ఇటీవల కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడలో నిర్వహించిన విజయ భేరి సభలో ఎఐసిసి అగ్రనేత సోనియాగాంధీ తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం, ఉద్యమ కారులకు కుటుంబాలకు 25 వేల రూపాయల పెన్షన ఇచ్చి గౌరవిస్తామన ప్రకటించడాన్ని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం స్వాగతిస్తున్నది. కాంగ్రెస్ పార్టీకి సోనియాగాంధీకి, టి-పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఫోరం ధన్యవాదాలు తెలిపింది.

## చిత్తశుద్ధితో లబ్దిదారులను ఎంపిక చేయండి

**సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్**



రెవిన్యూ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఉమామహేశ్

దుండిగల్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త : డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల ఎంపికలో అవకతకవలు జరిగాయని సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేశ్ ఆరోపించారు. ఈమేరకు బుధవారం దుండిగల్ తహాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా అధికారుల లెక్కల ప్రకారం సుమారు 20వేల మంది ఫోన్లు కలవకపోవడం, చిరునామ మారిపోవడం వంటివి జరగడం వలన వెరిఫికేషన్ కాలేదని అటువంటి ధరఖాస్తు దారులను ఎలా తొలగిస్తారని, మిగిలన వారి నుండి లబ్దిదారులను ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. ఒక ప్రాంతంలో కూర్చొని అక్కడ కొంత మంది వివరాలు అడిగి, ఆబస్తీలో ఉన్న వారిని అని తెలుసుకోవడం సరియైన పరిశీలన కాదన్నారు. తద్వారా అర్హులైన వారు నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల అనుచరులను లబ్దిదారులుగా ఎంపిక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికైచిత్తశుద్ధితో విచారణ చేసి అర్హులైన వారిని లబ్దిదారులకు ఎంపిక చేసి డబుల్ ఇండ్లను పంపిణీ చేయాలని, లేని పక్షంలో 60గజాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఫర్వీనాబేగం, జిహెచ్ఎంసి అధ్యక్షులు రాములు, మహిళా సంఘం నాయకురాలు నసీరా బి. తాహెరా, ప్రభాకర్, శ్యామ్, జుబేరా, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు బిజెపి నేత చేయూత



పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేద విద్యార్థులకు చేయూత అందించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మూసాపేట డివిజన్‌లో గణేష్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించిన అంనతరం స్థానిక నాయకులు పేద విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని వడ్డేపల్లి దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే స్పందించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు విద్యార్థుల చదువు నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. వివేకానంద స్కూల్‌లో చదువుతున్న బాబీ, శశికాంత్‌ల కుమారుడు శంకర్‌కు, బి.సిద్దమ్మ కుమారుడు నాగరాజుకు, ప్రియాంక కుమారుడు సాయిలకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గణేష్ యూత్ ఫోర్స్ అధ్యక్షులు చింటుగౌడ్, ఉపాధ్యక్షులు దత్తు పటేల్, జనరల్ సెక్రటరీ సిద్ధు, సప్పిడి శ్రీను, బిజెవైఎం డివిజన్ ప్రెసిడెంట్ ప్రశాంత్‌రెడ్డి, చరణ్, వైకుంఠం, సాయి, సన్నీ, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్పు కోసం పాదయాత్ర



బిజెపి శ్రేణులతో కలిసి పాదయాత్ర చేస్తున రవీంద్రరావు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : వివేకానందనగర్ డివి జన్ పరిధిలోని పాపిరెడ్డినగర్ సమ్మక్క సారలమ్మ దేవాలయం నుండి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీంద్రరావు ఆధ్వర్యంలో మార్పు కోసం పాదయాత్ర బుధవారం జరిగింది. డివిజన్ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమై వివిధ బస్తీలలో పర్యటించి ప్రజా సమస్యలను ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవీంద్రరావు మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజా సమస్యలు కోకొల్లలుగా కనపడుతున్నాయని అన్నారు. స్థానికంగా 58, 59జీవో కింద క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పి ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు ప్రజల నుండి దరఖాస్తులు తీసుకుని తీర సమయానికి అధిక మొత్తంలో డబ్బులు వసూల్ చేయడం దుర్మార్గం అన్నారు. బస్తీలలో రోడ్లన్ని అస్తవ్యస్తంగా ఉన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త : బాచుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం(21-09-2023) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11కెవి ఏస్‌టైర్ ఫీడర్ పరిధిలోని దేవిహోమ్స్, మమతహాస్పిటల్ నుండి బాచుపల్లి సిగ్నల్ వరకు ఉదయం 10గంల నుండి మధ్యాహ్నం 1గంల వరకు, 11కెవి ఏస్‌టైర్ మల్లంపేట ఫీడర్ పరిధిలోని బాచుపల్లి సిగ్నల్ నుండి చైతన్య కళాశాల వరకు, రెయిన్‌బోకాలనీ, ప్రణీత్‌జీనత్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంల నుండి సాయంత్రం 4గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహాకరించాల్సిందిగా ఏఈ కోరారు.

## కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు ప్రభుత్వం వచ్చాక తప్పక అమలు చేస్తాం: రవీందర్‌గౌడ్



రాంగోపాల్‌పేట డివిజన్ లో పాదయాత్ర చేస్తున్న డాక్టర్ రవీందర్‌గౌడ్

బేగంపేట సెప్టెంబరు 20,ప్రభాతవార్త : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు అధికారంలోకి తీసుకురావాలని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన రాంగోపాల్ డివిజన్ లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ హామీలను ప్రజలకు వివరించారు. తెలంగాణా రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, మణిమాల, కమల్‌రాజ్, రమేష్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## గణేషునికి పూజలు



వివేకానంద్‌నగర్ కమిటీ హాల్లో గణనాథునికి పూజలు నిర్వహిస్తున్న ఓబీసీ మోర్చా బీజేపీ ఉపాధ్యక్షులు పులిగోళ్ల శ్రీనివాస్‌యాదవ్

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త : గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని వివేకానందనగర్ కాలనీలో శ్రీ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో చేసిన గణనాథునికి ఓబీసీ మోర్చా బీజేపీ ఉపాధ్యక్షులు పులిగోళ్ల శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మండపంలో విగ్రహదాత సూరం శ్రీనివాస్ రెడ్డి, లడ్డు దాత గంగుమల్ల వరప్రసాద్, గణేషుల నాగేశ్వరరావు, లైటింగ్ దాత హైటెక్ ప్రసాద్, అన్నదాత జంగారెడ్డి, కళ్యాణ్ లక్ష్మి, ఏడుకొండలు, మధుసూధనాచారి, చెల్లయ్య, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

### పూలబండలో వైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



పూజలో పాల్గొన్న భాగ్యనగర్ జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు రమేష్ యాదవ్ తదితరులు

చార్మినార్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : పూలబండ శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం వద్ద క్రాంతి యూత్ అసోసియేషన్ ఆధర్యంలో అత్యంత వైభవంగా శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. పూలబండలో ఏర్పాటు చేసిన భారీ గణనాధునికి భాగ్యనగర్ జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు రమేష్ యాదవ్‌తో పాటు పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటి అధ్యక్షులు, బిజెపి నాయకులు రమేష్ యాదవ్ మాట్లాడుతూ గత ముప్పై నాలుగు సంవత్సరాలు నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఎంతో వైభవంగా జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినధులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ కవితను కలిసిన చార్మినార్ బిఆర్ఎస్ నాయకులు



చార్మినార్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : చట్ట సభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సందర్భంగా ఎమ్మెల్సీ కవితను బుధవారం చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మహ్మద్ ఇలియాస్ ఖురేషీ, మల్లిఖార్జున్ యాదవ్, దూద్‌బౌలి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు రాకేష్‌లు కలిసి పూల మొక్కలు అందజేసి అభినందించారు.

## భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి : శ్రీగణేష్



6వ వార్డు భావన కాలనీలో అన్నదానం చేస్తున్న శ్రీగణేష్

కంటోన్మెంట్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని ఎస్.జి.ఎఫ్.అధినేత ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం కంటోన్మెంట్‌లోని భావన కాలనీ, గణేష్ కాలనీ, పల్లవి స్కూల్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని పూజలు జరిపి బొజ్జ గణపయ్య ఆశీర్వాదం తీసుకున్నా రు. ఈ కార్యక్రమంలో నాయకులు షణ్ముకం, బాలక్రిష్ణారెడ్డి, కిషోర్ యాదవ్, శరత్, బిక్షపతి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నివేదితకు అభినందనలు తెలిపిన 2బిహెచ్‌కె లబ్ధిదారులు

కంటోన్మెంట్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలో నివాసం ఉంటున్న 21 మంది మైనార్టీ మహిళలు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు అందుకోబోతున్నందుకు బుధవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, మురళీ యాదవ్ పాల్గొన్నారు.

## 5వ వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : తేలుకుంట



కంటోన్మెంట్ 5వ వార్డులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న తేలుకుంట సతీష్ గుప్త తదితరులు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 5వ వార్డు ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ప్రముఖ సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త తెలిపారు. బుధవారం కాకగూడలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 5 యేండ్ల క్రితం డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం తమకు ఇండ్లు కెటాయించలేదని, సర్వే జరపలేదని వారి దృష్టికి తెచ్చారు. తన దృష్టికి తెచ్చిన సమస్యలను రెవెన్యూ అధికారులతో చర్చించి పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ మహిళలు సునీత, గీత, విజయ మేరీ, బేగం, అరుణ, మమత, స్వప్న, మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

### మూలుగూరి లక్ష్మీనారాయణ ఆచార్యకు డాక్టరేట్ ప్రదానం



మూలుగూరి లక్ష్మీనారాయణ ఆచార్యకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న జడ్జి వెంకటేశన్, ఐఎఎస్ అధికారి సపంత్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: వేదం యోగ గురువు మూలుగూరి లక్ష్మీనారాయణ ఆచార్యకు ఇటీవల గ్లోబల్ పీస్ యూనివర్సిటీ (జిపిహెచ్‌పియు) పిహెచ్‌డి చెన్నైలోని భారత విద్యాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ పి.మానుయాల్ ఆధ్వర్యంలో మ్యాన్ ఆఫ్ డివైనిటీలో పిహెచ్‌డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జడ్జి కె.వెంకటేశన్ ఐఎఎస్ అధికారి సంపత్‌కుమార్ ఆల్ ఇండియా హౌస్ కమిటీ చైర్‌పర్సన్ మునావలీ బేగం, చెన్నై పోలీస్ కమిషనర్ కె.రాజారాంల చేతుల మీదుగా మూలుగూరి లక్ష్మీనారాయణ ఆచార్యకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

## చెయ్యి బాధతో వంట మనిషి ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : చెయ్యి బాధ భరించలేక జీవనోపాధి కరువై జీవితం మీద విరక్తి చెందిన ఓ కుక్ ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శంషాబాద్, నడికూడ గ్రామానికి చెందిన కేతావత్ పాండు (30) బతుకు దెరువు కోసం భార్య ఇద్దరు పిల్లలతో కలిసి మూడు నెలలు క్రితం రాజేంద్రనగర్ సర్కిల్, బుద్వేల్‌లోని చాకలి బస్తీకి వచ్చాడు. పాండు వృత్తి రీత్యా వంట పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా పాండు చెయ్యికి దెబ్బ తగలటంతో వంట పనికి వెళ్ల లేక పోతున్నాడు. దీంతో జీవనోపాధి లేక పోవటంతో పాటు చెయ్యి బాధ భరించలేక తీవ్ర మనోవ్యధకు గురైన కేతావత్ పాండు బుధవారం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతి చెందిన పాండుకు భార్య, ఎనిమిది, ఆరు సంవత్సరాల వయస్సు గల ఇద్దరు కుమారులు కలరు. ఈ కేసును రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మరిన్ని సౌకర్యాలు

**మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి**



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి

సైఫాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మరిన్ని సౌకర్యాలను కల్పించిందని యూపిహెచ్‌సిలోని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి చెప్పారు. సుల్తాన్ బజార్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రైవేటు దవాఖానాలకు దీటుగా పేదలకు వైద్య సేవలు అందిస్తున్నామని, 134 రకాల పరీక్షలను తెలంగాణ దయాగ్నస్టిక్‌లో భాగంగా ల్యాబ్‌లో ఉచితంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. టెలి మెడికల్‌లో భాగంగా సైక్రియాట్రిస్ట్ వైద్య నిపుణులతో డిప్రెషన్ అందిస్తున్నామన్నారు. నాన్ కమ్యూనికేబుల్‌డీసీజ్ స్క్రీనింగ్ 30 సంవత్సరాల పైబడిన వారికి బిపి, షుగర్, గుండె, సంబంధిత వ్యాధులు, ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్, టిబి, లెప్రసీ స్క్రీనింగ్‌లను కూడా నిర్వహిస్తున్నామని మనోజ్‌రెడ్డి తెలిపారు. తమ క్రేందానికి సాధారణ జ్వరాలు, ఇతర లక్షణాలతో వచ్చిన వారినే కాకుండా మూ త్రపిండాలు, కంటి, గుండె, సమస్యలు ఉన్నవారు కూడా వస్తుంటారని, ప్రతి రోజు వంద నుంచి 120 మందికిపై రోగులు వస్తున్నారని, ప్రతి నెల 80 మందికిపైగా గర్భిణి స్త్రీలు వస్తున్నారని చెప్పారు.

## అధికార పార్టీ వ్యక్తులకే డబుల్ బెడ్ రూములు

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలమల్లేష్**



డిసికి వినతి పత్రం అందిస్తున్న బాలమల్లేష్

అల్వాల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: డబుల్ బెడ్‌రూములు కేటాయింపు లులో జరుగుతున్న అవకత కలపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలమల్లేష్ డిమాండ్ చేశారు. బుధవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాకు ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. అంతకు ముందు డిసి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. డబుల్ బెడ్‌రూములు కోసం 2016 నుంచి వచ్చిన ధరఖాస్తులపై అధికార యంత్రాంగం జవాబు చెప్పాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూములు కేటాయింపులో ఘోరంగా విఫలం చెందిందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కాకుండా బిఆర్ఎస్ పార్టీ నేతలు కార్యకర్తలకు అక్రమంగా కేటాయిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నేతలు కృష్ణమూర్తి, సహదేవ్, సల్మాన్ బేగ్, కరీం, నరేందర్, సుశీల, లలిత తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై బిజెపి సంబురాలు

అల్వాల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నేపథ్యంలో భారతీయ జనతాపార్టీ నేతలు సంబురాలు జరిపారు. గోల్నాక అల్వాల్‌లో ప్రధాని మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. దశాబ్ధాలుగా అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను మోదీ ప్రభుత్వం తీర్చడం జరిగిందని సీనియర్ నేత దండుగుల వెంకటేష్ తెలిపారు. ఇండియా మిత్రపక్షాలు మహిళా బిల్లును ఇప్పటి వరకు రాజకీయ అవసరాలకు మాత్రమే వాడకున్నాయని విమర్శించారు. బిల్లుపై ఎటువంటి కుంటి సాకులు చెప్పకుండా సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు మల్లిఖార్జున్ గౌడ్, సంతోష్ గౌడ్, కృష్ణారెడ్డి, కార్తీక్ గౌడ్, రవి కిరణ్, లక్ష్మణ్, అనీల్, లావణ్య, కరుణ శ్రీ పాల్గొన్నారు.

## గణపతి పూజలతో మారుమ్రోగుతున్న గ్రామాలు



హైదర్షాకోట్‌లో గణపతి పూజలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

నార్సింగి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త : గండిపేట మండలంలోని గ్రామాలన్నీ గణపతి పూజలు, నామ స్మరణంతో మారు మ్రోగుతున్నాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 11.గంటల వరకు ఏ బస్తీ/కాలనీ చూసినా గణపతి నామాలే వినిపిస్తున్నాయి. పిల్లలు, పెద్దలు మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేసి తమ భక్తిని చాటుకుంటున్నారు. మండప నిర్వాహకులు సైతం భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని మండపాల వద్ద తబల, తాళాలు, ఆర్మోనియంలను పెట్టుకొని భక్తి గీతాలపనతో భజనలు చేస్తున్నారు. పోటా పోటీగా ఏకదంతుడిపై భక్తి పాటలు పాడుతూ భక్తిసాగరంలో మునిగిపోతున్నారు. బండ్లగూడ జాగీర్‌లో జరిగిన గణపతి పూజల్లో మేయర్ మహేందర్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే హైదర్షాకోట్‌లో ప్రతిష్టించిన వినాయకుడి మండపం వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు. ఇక్కడ బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి, కార్పోరేటర్లు రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పుర ప్రముఖులు కుమార్ యాదవ్, దశరథ్, సాయిగౌడ్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలలో పెద్ద సంఖ్యలో భక్తజనులు పాల్గొని ఉండ్రాళ్లయ్య కరుణా, కటాక్షాలకు పాత్రులయ్యారు.

## టిఆర్ఎస్ అభివృద్ధి పనులే వివేకానంద్ గెలుపుకు పునాది

**కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మెన్ టి.లక్ష్మారెడ్డి**



చింతల్ డివిజన్ టిఆర్ఎస్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ టి.లక్ష్మారెడ్డి

కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి ఇంటింటికీ ప్రభుత్వ పథకాల అమలుతీరును వివరించి చెప్పడంద్వారా టిఆర్ఎస్ గెలుపుకు సన్నద్ధం కావాలని కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ టి.లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం చింతల్ డివిజన్ టిఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ చేసిన అభివృద్ధి పనులతో పాటు టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి జరిగిన మేలును ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు ప్రతి నాయకులు, కార్యకర్త ముందుకు రావాలని కోరారు.

## ఆకాష్‌నగర్‌లో సమస్యలు పరిష్కారం

**అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**



డ్రైనేజ్ పైప్ లైన్ పనులను ప్రారంభిస్తున్న అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పోరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

ధర్నాచౌక్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త: అంబర్‌పేట్‌లోని ఆకాష్‌నగర్ డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించి, అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం ఆకాష్‌నగర్‌లో 20లక్షల సీడీపీ నిధులతో చేపట్టిన డ్రైనేజ్ పైప్‌లైన్ పనులను ఆయన స్థానిక కార్పోరేటర్ విజయ్‌కుమార్ గౌడ్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక శాఖామంత్రి కేటీఆర్‌ల దిశానిర్దేశంలో అంబర్‌పేట్ నియోజకవర్గంలోని అన్ని కాలనీలలో, బస్తీలలో మౌళిక వసతులు కల్పించటంతో పాటు పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఆకాష్‌నగర్‌లో చేపట్టిన డ్రైనేజ్‌పైప్ లైన్ పనులను వేగవంతం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ యాదగిరిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



ఎస్సీఉపకులాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని పోస్టర్ ఆవిష్కరిస్తున్న బైరి వెంకటేశం మోచి, నిరగొండ బుచ్చన్న, లక్ష్మీనర్సయ్య తదితరులు

## వ్యాపార రంగంపై ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహించేందుకు సలహాలు, సూచనలు

**స్వావలంబి భారత్ అభియాన్ హైదరాబాద్ హెడ్, బిజెపి నేత ఇంద్రసేన్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఇంద్రసేన్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్వావలంబి భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా వ్యాపార రంగంపై ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించే ప్రత్యేక కార్య నిర్వహించబోతున్నట్లు స్వాలంబి భారత్ అభియాన్ హైదరాబాద్ హెడ్, బిజెపి నేత ఇంద్రసేన్‌రెడ్డి అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈకార్యక్ర మానికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. 33 జిల్లాలకు ఇంచార్జ్‌లను నియమించినప్పటికీ హైదరాబాద్‌ను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. స్వావలంబి భారత్ అభియాన్ ద్వారా చిరు వ్యాపారులను, చిన్న, మధ్యతరగతి వ్యాపారస్తులకు వారి వ్యాపార విస్తరణతో పాటు కొత్తవ్యాపారాలు చేసేందుకు కావాల్సిన అన్ని విషయాలను తాము ఉచితంగా వివరిస్తామన్నారు. అలాగే కొత్తగా వ్యాపార రంగంలోకి వచ్చే వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలతో పాటు బ్యాంకురుణాలు, మార్కెట్ స్థితిగతులపై తమ వద్ద పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈవేదిక ద్వారా చిన్న వ్యాపారులు పెద్దవ్యాపారులుగా మూరడంతోపాటు వారి వ్యాపార విస్తరణకు మంచి ప్లాట్‌ఫాంగా పనిచేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ప్రతినిధులు అశోక్, రవికాంత్, రాహుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్

బేగంబజార్, సెప్టెంబర్ 20ప్రభాతవార్త: తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోఠి డిఎంఇ కార్యాలయంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో రాష్ట్రంలోని నలు మూలల నుంచి 26 ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి 250 మందికిపైగా వైద్యులు పాల్గొన్నారు. 56 నెలల పిఆర్‌సి బకాయిలు ఏడు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, ముఖ్యమంత్రి సంతకం పేరుతో 8నెలలుగా కాలయాపన చేస్తున్నారని, గత5 సంవత్సరాల నుంచి జనరల్ బదీలు లేవన్నారు. డిహెచ్, వివిపి, నుండి డిఎంకి వచ్చే బోధనాసుపత్రుల వైద్యుల పేస్కేల్ సమస్యను పరిష్కరించాలని, నూతన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రైవేట్ ప్రాక్టీసు బ్యాన్ జి.ఓ.56ను పున:సమీక్షించాలని, ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనం నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమస్యలపై పలుసార్లు ముఖ్యమంత్రి కెసిఆర్, వైద్యఆరోగ్య శాఖ మంత్రిహరీష్‌రావులకు విన్నవించినట్లు తెలిపారు. వారంలో రోజులోపు ప్రభుత్వం నుండి స్పందన రాకపోతే రాష్ట్ర వ్యాప్తంగా 26 వైద్య కళాశాలలో నిరవధిక సమ్మెకు పిలుపు నిస్తామన్నారు. కార్యచరణ త్వరలోనే ప్రకటిస్తామని టిటిజిడిఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ అన్వర్, కార్యదర్శి డాక్టర్ జలగం తిరుపతిరావు, ఉపాధ్యక్షులు కిరణ్‌మాదల, కోశాధికారి కిరణ్‌ప్రకాష్‌లు తెలిపారు.

## డివిజన్‌లో పర్యటించిన కార్పొరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా డివిజన్‌లో పలు చోట్ల రోడ్లు దెబ్బతినడంతో స్థానిక డివిజన్ ప్రజలు హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె బుధవారం సంబంధిత అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించి, స్థానిక ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పడైన రోడ్లును బాగుచేయించి, విద్యుత్ వైర్లుకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను జిహెచ్ఎంసి సిబ్బందితో తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్, జిహెచ్ఎంసి అధికారుల, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా బిల్లు నారీలోకానికి నవశకం

**తెలంగాణ ఎస్సీ, ఎస్టీ బిసి, మైనార్టీ ప్రభుత్వోద్యోగుల సంఘ రాష్ట్రాధ్యక్షుడు శాగంటి సోమయ్య**

నాంపల్లి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో మహిళా బిల్లును ప్రవేశపెట్టడాన్ని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు శాగంటి సోమయ్య స్వాగతించి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన నాంపల్లిలో మీడియాతో మాట్లాడుతూ మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టిడం భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లికించదగ్గ చారిత్రిక అధ్యాయమని, ఇది నారీలోకానికి నవశకమని అభివర్ణించారు. ఈ బిల్లుపై చట్టసభల్లో లోతైన చర్చ జరిగి అన్నివర్గాలకు చెందిన మహిళలకు సమప్రాధాన్యం లభించాలని ఆకాంక్షించారు.

## వినోద్‌కుమార్ సేవలు చిరస్మరణీయం

**నూనెముంతల రమేష్‌గౌడ్**

హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎల్ఐసి ఎండిఆర్‌టి సభ్యుడు మంత్రి వినోద్‌కుమార్ (59) అందించిన సేవలు చిరస్మరణీయమని జైస్వాల్ గార్డెన్ ,మైసమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షులు నూనెముంతల రమేష్‌గౌడ్ అన్నారు. బుధవారం గోల్నాక డివిజన్‌లోని జైస్వాల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వినోద్‌సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి ఆలయ కమిటీ అధ్యక్షులు రమేష్‌గౌడ్, జైశ్వాల్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రతినిధులు పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కోసం అహర్నిషలు పోరాటాలు చేసి త్యాగాలకు సైతం వెనకడుగు వేయకుండా మంత్రి వినోద్‌కుమార్ ముందుకు సాగిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో భార్య మంత్రి నాగలక్ష్మీ, కుమారుడు మంత్రి సాయి విశ్వాస్, కుటుంబసభ్యులతోపాటు పులిజాల గెల్వయ్య, నూనెముంతల వెంకటేశ్వర్లు, అతికం శ్రీనివాస్‌గౌడ్, శ్యామ్‌గౌడ్, పడకంటి అంజయ్యచారి, వెంకటేష్, నూనెముంతల వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇచ్చిన ప్రతిహామీని తూచ తప్పకుండా నెరవేర్చి ప్రజలకు చేరువయ్యిందని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ అన్నారు. ప్రగతి యాత్రలో భాగంగా కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని మహేంద్రనగర్, కాకతీయనగర్‌లలో స్థానిక మాజీ కార్పొరేటర్, డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు కె.ఎం.గౌరీష్‌తో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు, టిఆర్ఎస్ అభిమానులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వనిధులతో పూర్తిచేసిన అభివృద్ధి పనులు సిమెంట్‌రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులను ప్రజలతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో పురపాలక శాఖమంత్రి కెటిఆర్ తో కలిసి అభివృద్ధిలో భాగస్వాములవుతున్నట్లు తెలిపారు. మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో సమస్యల పరిష్కారానికి నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. టిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, కుత్బుల్లాపూర్ డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి సత్తిరెడ్డి, బొంబాయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


**తెలంగాణ ప్రభుత్వం**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC

నిట్ నం. 14/EE5/SRNR/GHMC/2023-24 తేదీ: 20.09.2023
తేదీ: 20.09.2023- రెండు పనుల పేరుకు అదే నిట్ నం. (05) నం. పనులు "సివిల్ పనులు" (1) నం. పనులు "సివిల్ పనులు" రెండింటి అంచనా మొత్తం రూ.126.00 లక్షలు, రూ.9.90 లక్షలు. బిడ్స్ స్వీకరణలకు రెండింటి చివరి తేదీలు, సమయం : 27.09.2023 సా.4.01గం., 25.09.2023 సా.4.01గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నెం. రెండింటికీ శ్రీ కె.శ్రీనివాస్ EE, సరూర్‌నగర్ సర్కిల్-5, GHMC (M) 9989930602. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.eprocurement.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, GHMC.
DIPR.No.6916-PP/CL/Advt/1/2023-24 తేదీ: 20.09.2023

**IN THE COURT OF XXVII ADDL CHIEF JUDGE COURT AT : SECUNDERABAD**
**O.S.No. 120 of 2019**
BETWEEN:
**Mr. Osman ...Plaintiff**
AND
**Gelaboina Chandrakala & others. ...Defendants**
To,
**Gelaboina Ramakanth** S/o Balraj Yadav, Aged about 27 years, Occ: Business, R/o H.No.1-7-13/A, (New) 13/A (Old) Nethaji Nagar, Kadakpur, Sec'bad. **...Defendant No.6**
As per the order of the Hon'ble Court through I.A.No.1573/2023 in O.S.No.120 of 2019.
Please take notice that above case is posted to 25.09.2023 for your appearance at 10.30 a.m., hence you are required to appear before the Court either in person or through an advocate, otherwise the matter will be adjudicated in your absence as per law.
By the Order of the Court
**Sd/- J. ANANTH RAM & Associate, Advocates**
H.No.13-3-1110/9, Sree Neel Kant Nagar, Jiyaguda, Hyderabad-06,
**Cell: 9000456827.**

**బహిరంగ ప్రకటన**
సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మా క్లైంట్‌లు **శ్రీమతి పూర్ణిమ పులగం భర్త శ్రీ సూర్యనారాయణ రెడ్డి పులగం, శ్రీ సూర్యనారాయణ రెడ్డి పులగం తండ్రి శ్రీ పి. హరినాథ్ రెడ్డి**, తెలంగాణ, రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, శేరిలింగంపల్లి సర్కిల్, GHMC, రాయ్‌దుర్గ్ పన్మక్త గ్రామం వద్ద ఉన్న సర్వే నం.5/3లోని 1235 చ.గజాలు, 1032 చ.మీటర్లకు సమానమైన మొత్తం విస్తీర్ణం, ప్లాట్ నం.9/A దాని మొత్తానికి తాము సంపూర్ణ హక్కులు కలిగి ఉన్న యజమానులు మరియు స్వాధీనదారులుగా ప్రకటిస్తూ తేదీ 24.03.2021 రిజిస్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ సం.7950/2021 క్రింద దానిని కొనుగోలు చేసినట్లు ప్రకటిస్తూ, పైన పేర్కొన్న ఆస్తికి చెందిన డాక్యుమెంట్ సం. 185/2003 తేదీ 16.12.2002 మరియు డాక్యుమెంట్ సం.10164/2002 తేదీ 20.11.2002 దాని సంబంధిత ప్రియర్ టైటిల్ డీడ్స్ పోగొట్టుకొన్నట్లుగా తెలియచేస్తున్నారు.
సదరు డాక్యుమెంట్లు దొరికినవారు, వారం రోజులలోగా ఈ దిగువ సంతకందారుని సంప్రదించవచ్చును మరియు వాటిని స్వాధీనపరచ కోరుతున్నాము. ఏదైనా సంస్థ/ఎవరైనా వ్యక్తి/లు/బ్యాంక్‌లు/ఆర్థిక సంస్థలు పైన పేర్కొన్న సదరు ఆస్తికి సంబంధించి ఏమైనా అభ్యంతరాలు, క్లైమ్, హక్కు టైటిల్, ఆసక్తి, ఏవిధమైన స్వభావం గల వివాదం అయినా అతడు/ఆమె/వారు ఈ ప్రకటన ప్రచురింపబడిన తేదీ నుండి ఏడు (7) రోజులలో అతని యొక్క/ఆమె యొక్క/వారి అభ్యంతరం క్లైమ్, హక్కు టైటిల్, ఆసక్తి/వివాద వివరాలతో వాటిని నిరూపించగల డాక్యుమెంటరీ నిరూపణలతో దిగువ సంతకందారుని సంప్రదించవలెను. విఫలమైతే నా క్లైంట్ ఎటువంటి అభ్యంతరాలు/క్లైమ్‌లు/ఎవరి యొక్క వివాద వివరాలు/వ్యక్తి/లు ఎవరి నుంచి ఏమీ లేవని నిర్ధారించి మరియు తర్వాతి క్లైమ్‌లు లేదా వివాదాలు ఏమీ పరిగణించడం జరగదని తెలియజేస్తున్నాను.
**ప్రసాదరావు అప్కారి,** న్యాయవాది
ఫ్లాట్ నం.103, కృష్ణారెడ్డి విల్లా, బ్లాక్-B, ఇ.సం.1-11-271/D1/103B, గగన్‌విహార్ కాలనీ, భగవంతపురం, బేగంపేట, హైదరాబాద్.
ఇ-మెయిల్: advprasada.apkari@outlook.com
మొబైల్: 9582795964, 8106795964, 040-35941590

**IN THE COUR OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT SECUNDERABAD**
**O.S.NO. 823 OF 2023**
Between :-
**Smt. SunkariVidyavathi ...Plaintiff**
AND
**The Tahsildar Balanagr Mandal & another ...Defendants**
To
**All concerned, ...Defendant No.2**
The plaintiff has instituted above suit forthe relief of Declaration of Legal Heirs to declare plaintiffs Nos. 1 to 3 as the only Legal Heirs of the deceased Late Sunkari Veeera Bhadrappa who died intestate on 17-07-2023. The above case stands posted to **20-11-2023** for the appearance of the defendants. If any person is having any right, claim or objection if any may appear before the above court at **10.30 A.M.** either in person or through their counsel on the date, month and year above mentioned failing which the court shall proceed with the case as per law.
**K.S. KUMAR**
**Advocate**
10-1-626/A, West Marredpally Secunderabad-500026,
**Mobile No. 9966971155.**

**IN THE COUR OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT SECUNDERABAD**
**O.S.NO. 831 OF 2023**
Between :-
**Sri. Anil Singh ...Plaintiff**
AND
**The Tahsildar Secunderabad Mandal & another ...Defendants**
To
**All concerned, ...Defendant No.2**
The plaintiff has instituted above suit for the relief of Declaration of Legal Heirs to declare plaintiffas the only Legal Heirs of the deceased Late Dayaram Dhan Singh who died intestate on 16-06-2014. The above case stands posted to **21-11-2023** for the appearance of the defendants. If any person is having any right, claim or objection if any may appear before the above court at **10.30 A.M.** either in person or through their counsel on the date, month and year above mentioned failing which the court shall proceed with the case as per law.
**K.S. KUMAR**
**Advocate**
10-1-626/A, West Marredpally Secunderabad-500026,
**Mobile No. 9966971155.**

**BEFORE THE MICRO & SMALL ENTERPRISES FACILITATION COUNCIL (MSEFC) RANGA REDDY REGION :: HYDERABAD**
**Case No.754/MSEFC/2021**
Dispute Between:
**M/s. Paam Commercial Pvt Ltd.,** 5-3-488, O.T. Road, Osmangunj, Hyderabad-12. **...CLAIMANT**
Vs
**M/s. R K I Builder Pvt Ltd,** 8-2-269/W, Plot No.7, BLKR House, 4th Floor, Womens Co-Op Society, Road No.2, Banjara Hills-500034. **...RESPONDENT**
**NOTICE**
The above named Claimant had filed Reference and statement of claim against the Respondent for recovery of dues by statutory Conciliation as per MSMED Act of 2006. Respondent failed to comply with previous notices. Hence, this final notice requires Respondent to make his personal appearance before Facilitation Council located at GM DIC, S-31, Second Floor, Integrated District Offices Complex (IDOC), Collectorate, Ranga Reddy District, located in Kongarkalan (V), Ibrahimpatnam (M), Ranga Reddy District-Pin code-501510 on 26.09.2023 at 3.30 PM. In case of non-compliance, the said claim will be decided on merits by Council.
**//BY ORDER OF THE CHAIRMAN MSEFC : RANGA REDDY//**

**BEFORE THE MICRO & SMALL ENTERPRISES FACILITATION COUNCIL (MSEFC) RANGA REDDY REGION :: HYDERABAD**
**Case No.755/MSEFC/2021**
Dispute Between:
**M/s. Paam Commercial Pvt Ltd.,** 5-3-488, O.T. Road, Osmangunj, Hyderabad-12. **...CLAIMANT**
Vs
**M/s. Rizzu Constructions,** H.No.56, Near Maruthi Service Centre, Madhura Nagar-500038. **...RESPONDENT**
**NOTICE**
The above named Claimant had filed Reference and statement of claim against the Respondent for recovery of dues by statutory Conciliation as per MSMED Act of 2006. Respondent failed to comply with previous notices. Hence, this final notice requires Respondent to make his personal appearance before Facilitation Council located at GM DIC, S-31, Second Floor, Integrated District Offices Complex (IDOC), Collectorate, Ranga Reddy District, located in Kongarkalan (V), Ibrahimpatnam (M), Ranga Reddy District-Pin code-501510 on 26.09.2023 at 3.30 PM. In case of non-compliance, the said claim will be decided on merits by Council.
**//BY ORDER OF THE CHAIRMAN MSEFC : RANGA REDDY//**

**BEFORE THE MICRO & SMALL ENTERPRISES FACILITATION COUNCIL (MSEFC) RANGA REDDY REGION :: HYDERABAD**
**Case No.1956/MSEFC/2020**
Dispute Between:
**M/s. Paam Commercial Pvt Ltd.,** 5-3-488, O.T. Road, Osmangunj, Hyderabad-12. **...CLAIMANT**
Vs
**M/s. Srabani Construction,** 502, 5th Floor, Ramachandra Residency, Kondapur, Serilingampally Mandal, Telangana. **...RESPONDENT**
**NOTICE**
The above named Claimant had filed Reference and statement of claim against the Respondent for recovery of dues by statutory Conciliation as per MSMED Act of 2006. Respondent failed to comply with previous notices. Hence, this final notice requires Respondent to make his personal appearance before Facilitation Council located at GM DIC, S-31, Second Floor, Integrated District Offices Complex (IDOC), Collectorate, Ranga Reddy District, located in Kongarkalan (V), Ibrahimpatnam (M), Ranga Reddy District-Pin code-501510 on 26.09.2023 at 3.30 PM. In case of non-compliance, the said claim will be decided on merits by Council.
**//BY ORDER OF THE CHAIRMAN MSEFC : RANGA REDDY//**

**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT HYDERABAD TELANGANA STATE**
**O.S.No. 329 OF 2023**
Between:
**Unior Bank of India,** Bajarahills Branch, Road No.4, Opposite to GVK Mall, represented by its Chief Manager **...Plaintiff**
And
**Sri Sagamone Kurmaiah ...Defendant**
To,
**Sri Sagamone Kurmaiah,** S/o Sri Narasimha, aged about 26 years, Occ: Business, R/o H.No.8-3-228/860/A/2, Rahamathnagar, Yousufguda, Ameerpet, Hyderabad-500045. **...Defendant**
The Plaintiff has filed the above numbered suit against you, for recovery of **Rs.10,35,168-62 Ps.** (Rupees Ten lakhs thirty five thousand and one hundred and sixty eight and paise sixty two only) together with subsequent interest @10.45% per annum due under vide TLP07 A/C No.59040617 0000014 with month rests from date of suit till realization and by way of sale of hypothecated vehicle No. TS109BSTR2832 Maruthi Dezire and the same stands posted to **17.10.2023** for your appearance in person or through duly appointed Advocate at 10.30 A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.
(By Order of the Court)
**Sd/- S. MUJIB KUMAR**
**Advocate, High Court, Telangana Sate Counsel for the Plaintiff**
H.No.16-11-16/T/5, West Prasanthnagar Colony, Moosarambagh, Hyderabad-500036.

## నిరుపేదల సంక్షేమమే కెసిఆర్ లక్ష్యం: మంత్రి



ట్రై సైకిల్ అందజేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, సరూర్‌నగర్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా సిఎం కేసీఆర్ పాలన సాగుతుందని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్‌కు చెందిన 6మంది దివ్యాంగ లబ్ధిదారులకు 3 చక్రాల బ్యాటరీ సైకిల్‌ను మంత్రి బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సబిత మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా 80మంది దివ్యాంగులకు రూ.40వేల విలువచేసే బాటరీ సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. ఈ సైకిల్ 30 కిలో మీటర్ల ప్రయాణం చేస్తుందని, దివ్యాంగులు తమ పనులు ఎవరిమీద ఆదారపడకుండా సొంతగా చేసుకోవ చ్చనే భరోసా దొరుకుతుందని అన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెంద్యాల నగేష్, ఊర్మిళరెడ్డి, అనురాధ, మురళీధర్‌రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.
**మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో...** జల్‌పల్లి మున్సిపాలిటీలోని ప్రీమియర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన 313మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను, 80 మంది దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలను, 180 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేసే కార్యక్రమానికి హోంమంత్రి మహమూద్ అలీ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సబితారెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ ఇంతియాజ్ హుస్సేన్, జల్‌పల్లి మున్సిపాలిటీ వైస్ ఛైర్‌పర్సన్ ఫర్హానా నాజ్, సరూర్‌నగర్ మాజీ వైస్ ఎంపిపి ఒమర్ బామ్, పలువురు కౌన్సిలర్లు, ఎంఐఎం, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బాలాపూర్ గణేషునికి తీగల కృష్ణారెడ్డి, తీగల అనితా హరినాథ్‌రెడ్డిల పూజలు



తీగల కృష్ణారెడ్డి, అనితా హరినాథ్‌రెడ్డిలకు ప్రసాదాన్ని అందజేస్తున్న దృశ్యం

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, లడ్డూ వేలాల నిర్వహణలో సుప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణేషుడిని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్‌రెడ్డిలు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేక లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వంగేటి లక్ష్మారెడ్డి, గుండోజు రఘునందనాచారి, కళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, గిరీష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.
**ఎమ్మార్వో మాధవీరెడ్డి ప్రత్యేక పూజలు...** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బాలాపూర్ గణేష్ మండపాన్ని తహశీల్దార్ మాధవీరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి వారు ఆమెచే గణేషునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రత్యేక లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.

## ఘనంగా గణనాథుడికి కాలనీవాసుల పూజలు



పూజలు నిర్వహిస్తున్న వినాయకహిల్స్ కాలనీవాసులు

**తుర్కయాంజాల్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** వినాయకహిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వి.శ్రీధర్‌రెడ్డి, అమరేందర్‌రావు, ట్రెసరర్ బి.శివకుమార్, మాజీ అధ్యక్షులు కొండల్‌రెడ్డి. కమిటి సభ్యులు. రాజిరెడ్డి. చంద్రశేఖర్‌రెడ్డి వినాయకహిల్స్ కాలనీ వాసులు సమక్షంలో గణనాథుడికి పూజలు నిర్వహించారు. అనంతరం కరపత్రాన్ని అవిష్కరించారు.

## మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత



సిసి రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆస్మాన్‌ఘడ్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు, పారిశుధ్యం వంటి మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు.

## నిమజ్జనాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మనోజ్ కాలనీలో గణనాథుడికి నిర్వహిస్తున్న పూజలో పాల్గొన్న లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :** గణేష్ ఉత్సవాలు నిమజ్జనాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని బిఎల్ఆర్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ టిఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆపరా సర్కిల్ పరిధిలోని కాప్రా డివిజన్ మనోజ్ కాలనీలో కాలనీ అధ్యక్షులు శివరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ ప్రత్యేక పూజలు ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రోల్‌మోడల్‌గా ఎల్బీనగర్: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** మార్నింగ్‌వాక్‌లో భాగంగా బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు కొత్తపేట డివిజన్ సత్యనగర్‌కాలనీలో పాదయాత్రలోస్థానికులను సమస్యలడిగి తెలుసుకున్నారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ తప్పకుండా అడిగిన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేస్తానని హామీనిచ్చారు. డ్రైన్స్, సబ్‌రోడ్స్ మంజూరు చేశామన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వాకింగ్ ట్రాక్‌కు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గ్రేవీయార్డులో వ్యర్థ పదార్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటామని, నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీకార్పొరేటర్ సాగర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్, రాగిరి ఉదయ్‌గౌడ్, విజయగౌడ్, మహేష్‌రెడ్డి, ఇటికల యాదగిరి, నగేష్, పులికంటి వెంకట్, కాలనీ అధ్యక్షులు మనోహర్‌ప్రసాద్‌శుక్ల, రమణ, నాగు పాల్గొన్నారు.

## భగాయత్ కాలనీల సమస్యలు పరిష్కరిస్తా



రామంతాపూర్ భగాయత్ కాలనీలో పర్యటిస్తున్న బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** రామంతాపూర్ భగాయత్ కాలనీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని బిఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రామంతాపూర్ భగాయత్ పరిధిలోని సత్యనగర్, లక్ష్మీశ్రీకాంత్‌నగర్, రవీంద్రనగర్, గంగోత్రినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామంతాపూర్ భగాయత్ పరిధిలోని కెసిఆర్‌నగర్‌లో సుమారు 18 కాలనీలో ఐదు వేల కుటుంబాలు ఉన్నాయని, వీరికి మౌళిక వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భగాయత్ కాలనీలో డ్రైనేజీ,ఇంటి నెంబర్లు, విద్యుత్ స్థంభాలు, ట్రంక్ లైన్, మినీ మ్యాక్స్, సిసి రోడ్ల నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, బిఆర్ఎస్ నేతలు మధుసూధన్‌రెడ్డి, ముస్తాక్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, సూరం శంకర్, చాంద్‌పాషా, నగేష్, ఆలే రమేష్, మహేందర్, బోసాని పవన్, కాలనీ నేతలు సాగర్, రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సీతమ్మ తదిరతులు పాల్గొన్నారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం : గవర్నర్ లయన్ హరీష్‌రెడ్డి

**కుషాయిగూడ, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :** ఈసీఐఎల్ కంపెనీ వ్యవస్థాపకులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, డా. ఏఎస్ రావు 109వ జన్మదినం సందర్భంగా కమలానగర్ సాయి సుధీర్ కాలేజీలో లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా ఏఎస్ రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన, వైద్య శిబిరానికి లయన్స్ క్లబ్ 320సి జిల్లా గవర్నర్, ప్రముఖ పారిశ్రామికవేత్త హరీష్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త దానం వల్ల ఎంతోమంది రోగులకు మేలు జరుగుతుందని, రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందన్నారు. అలాగే వైద్య శిబిరం ద్వారా సామాన్య ప్రజలకు, పేదలకు చేసే లయన్స్ సేవలను అభినందించారు. సన్ సీడ్ హాస్పిటల్ వైద్యులు హన్సిక, హేమంత్ ఆర్యాస్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వి.కృష్ణప్రసాద్, క్యాంపు కోఆర్డినేటర్లు ఎం.శ్రీదేవి, రవికుమార్‌యాదవ్, కాలేజ్ సెక్రెటరీ, కరస్పాండెంట్ ఆర్.ఉషారాణి, ప్రిన్సిపల్ మీరా, నీలంరెడ్డి, మహేష్, క్లబ్ ప్రెసిడెంట్ విజయకుమార్ కంతేటి, ఇతర క్లబ్ సభ్యులతోపాటు కుషాయిగూడ ఆలయ పాలకమండలి ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, భాగ్యనగర్ గ్రీన్ సిటీ లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వడ్లోజు జ్యోతిర్మయా చారి తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ మంత్రాల చెరువుపై నిమజ్జనాల కోసం క్రేన్ ఏర్పాటు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్ మంత్రాల చెరువు వద్ద గణేషుని విగ్రహాల నిమజ్జనం కోసం కార్పొరేషన్ ఆధ్వ ర్యంలో క్రేన్‌ను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల గణేషులను చెరువులో నిమజ్జనం చేయడానికి వీలుగా ఏర్పాటు చేసిన క్రేనును కమీషనర్ వాణి, ఎస్ఇ ఆంజనేయ ప్రసాద్, డిఇఇ గోపినాథ్, మహేశ్వరం నియోజకవర్గ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, మీర్‌పేట్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పసునూరి బిక్షపతిచారి, ప్రధాన కార్యదర్శి భీమరాజ్, ఉపాధ్య క్షుడు గోపినాథ్,వేణుగోపాలరెడ్డి, రంగారెడ్డి, సాయినాథ్ తదితరులు పరిశీలిం చారు. ఈ సందర్శంగా వారు మాట్లాడుతూ క్రేనును ఉత్సవ సమితిల వారు ఉపయోగించుకోవాలని సూచించారు.

## రామంతాపూర్‌లో ఎన్వీఎస్ఎస్ పూజలు

**రామంతాపూర్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని వినాయక మండపాల వద్ద బుధవారం మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ సందర్శించి పూజలు నిర్వహించారు. రామంతాపూర్ ప్రధాన రహదారిలోని శ్రీ లక్ష్మి గణపతి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వారు పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు విజయవంతంగా చేసుకోవాలని, భక్తులకు మండపాల వద్ద ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గత 30 సంవత్సరాలుగా గణనాధుని ఏర్పాటు అభినందనీయమన్నారు. అదేవిధంగా ఉప్పల్ రాఘవేంద్రనగర్‌లో బిజెపి నేత కంచర్ల భరత్‌రెడ్డి ఏర్పాటు చేసిన వినాయక మండపంవద్ద జరిగిన అన్నదానంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, దయానంద్‌రెడ్డి, నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

## గణనాధులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పూజలు

**సైదాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్‌లోని సుల్తాన్ వాల్యా, చంపాపేట క్రికెట్‌క్లబ్, మారుతినగర్, దుర్గాభవానినగర్, ఎస్‌జిఆర్ కాలనీ, రాజిరెడ్డినగర్, కటికోనికుంట, కుమ్మరిబస్తీ, నెహ్రూనగర్, చంపాపేట ఓల్డ్‌విలేజి, కర్మన్‌ఘాట్ ఓల్డ్‌విలేజి, సాయిరాంనగర్‌లలోని గణనాధుడి మండపాలను ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సందర్శించి గణనాధులకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో నల్ల రఘుమారెడ్డి, గజ్జెల మదుసూధన్‌రెడ్డితో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనోత్సవాలకు ఏర్పాట్లు : బేతి

**ఉప్పల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** వినాయక నిమజ్జనోత్సవాలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ నల్ల చెరువు వద్ద వినాయక నిమజ్జనం కొలను వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నల్ల చెరువువద్ద నిమజ్జనం కోసం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే తమ ధ్యేయమని తెలిపారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసి శ్రీనివాస్, ఇంజనీర్ ఎల్.నాగేందర్, బిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, రఘుపతిరెడ్డి, వేముల సంతోష్‌రెడ్డి, గుడి మధుసూధన్‌రెడ్డి, పంగ మహేందర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పిఎన్ఆర్ కాలనీ సొసైటీ కాలనీలో ఎమ్మెల్యే మైనంపల్లి ప్లాట్ల కబ్జా అవాస్తవం

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :** మల్కాజిగిరి పిఎన్ఆర్ సొసైటీ కాలనీలో మైనంపల్లి కబ్జాలు అవాస్తవమని, తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని పిఎన్ఆర్ సొసైటీ అధ్యక్షులు ఎం.వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం ఆనంద్‌బాగ్‌లోని గ్రీన్ ల్యాప్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...సొసైటీకి సంబంధం లేని వ్యక్తులు సొసైటీ ప్రతినిధులుగా చెప్పుకోవడం సరికాదని ఇలాంటి వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు అధికారులను కోరారు. పిల్లి నరసింగరావు సొసైటీ కాలనీకి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చేసిన సేవలు మర్చిపోలేనివన్నారు. సొసైటీ స్థలం యూసఫ్ బేగం వద్ద 2010లో జిపిఏ ఇచ్చిందన్నారు. గుడిసెలు వేసుకున్న పేదలందరికీ 42 గజాల చొప్పున నోటరీ చేసి ఇచ్చారని తెలిపారు. 42 గజాలతో ప్లాట్లను ఏర్పాటు చేసి గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికి స్థలాలను కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు. కొంతమంది కబాదారులు సొసైటీకి చెందిన సర్వే నెంబర్లకు బై నెంబర్‌లు వేసి స్థలాలను కబ్జా చేసి ఇతరులకు అమ్ముకున్నారని, కబ్జాదారుల వద్ద మోసపోయిన వ్యక్తులు ఇతరులను ఆశ్రయిస్తూ విషయాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యే మైనంపల్లి సొసైటీలోని ప్లాట్లను కబ్జాలు చేశారనడం సరికాదన్నారు. కబ్జాదారులు మాపై కేసులు వేసి ఒక కేసు కూడా గెలవలేకపోయారని తెలిపారు. మురికివాడలో మౌళిక సదుపాయాలు కల్పించిన ఎమ్మెల్యే కబ్జాలు చేస్తున్నారని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ముదిగొండ లక్ష్మణ్ పిల్లి నరసింగరావునగర్ కాలనీ సభ్యులు మంగ, నజీమా, గణేష్, కిశోర్, శ్యామ్యుల్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి చిల్లర రాజకీయాలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌శర్మ తదితరులు

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** ఫ్లెక్సీల పేరుతో బిజెపి చిల్లర రాజకీయాలు మానుకోవాలని మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ హెచ్చరించారు. ఆర్కేపురం డివిజన్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరవింద్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి అధికారులు ఫ్లెక్సీలు తొలగిస్తే మంత్రి సబితాఇంద్రారెడ్డిపై ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. అందెల శ్రీరాములుయాదవ్ అవగాహనలేకుండా జిహెచ్ఎంసిఅధికారులు బిఆర్ఎస్ నాయకులు కట్టిన ఫ్లెక్సీలకు కూడా చలాన్లు విధించారన్నారు. మంత్రి సబితాఇంద్రారెడ్డి బిజెపి ఫ్లెక్సీలు తొలగించాలనుకుంటే ఒక్క ఫ్లెక్సీ కూడా ఉండదన్నారు. పాదయాత్ర పేరుతో కాలనీలోని ప్రజలకు ఇష్టం లేకున్నా బిజెపి కండువాలు కప్పి సోషల్‌మీడియాలో ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఆర్కేపురంలో బిజెపి ఎనిమిదేళ్ల కాలంలో ప్రజాసమస్యలు పరిష్కరించిందా అని ప్రశ్నించారు. మంత్రి చేస్తున్న అభివృద్ధిని, ప్రజాదరణను ఓర్వలేకనే ఫ్లెక్సీ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బిజెపి నాయకులు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెంద్యాల నగేష్, పెంబర్తి శ్రీనివాస్, రవీందర్‌రావు, దుబ్బాక శేఖర్, ఎస్‌కె.మహమ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్, రామాచారి, కొండ్ర శ్రీనివాస్, లింగస్వామిగౌడ్, వెంకటేష్‌గౌడ్, ఎం.జగన్, నారాయణ, సోమేశ్వర రావు, అల్లావుద్దీన్‌పటేల్, షఫీ, పాషా పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో గణేష్ నిమజ్జనం కొలను సిద్ధం



గణేష్ నిమజ్జనం కొలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** ఉప్పల్ నల్ల చెరువు వద్ద వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్థానిక కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ ఇంజనీర్ ఎల్.నాగేందర్, ఎఇ సాయికిరణ్, డిఇ చందన తదితరులతో కలిసి వినాయక నిమజ్జన కొలను వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వినాయక నిమజ్జనం కోసం నల్ల చెరువు వద్ద పూర్తి స్థాయిలో ఏర్పాటు చేశామని, భక్తులు వినాయకవిగ్రహాలను ఇక్కడే నిమజ్జనం చేయాలని సూచించారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి, సల్ల ప్రభాకర్‌రెడ్డి, సుంకు శేఖర్‌రెడ్డి, నవీన్, పాలడుగు లక్ష్మణ్, రాజేందర్ రెడ్డి, రాఘవేంద్ర, మంద మురళీకృష్ణారెడ్డి, పూజారి హనుమంతు, వెంకటేష్, చంద్రశేఖర్‌రెడ్డి, రఘు, రేణుక, తైసిన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతిలో నిక్షిప్తమైన ఇంద్రధనస్సులోని వర్ణాలు : శంతన్ కుమార్

**సైదాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** ఇంద్రధనస్సులోని సప్త వర్ణాలు ప్రకృతి అంతటా నిక్షిప్తమై ఉన్నాయని ప్రముఖ విద్యావేత్త, కేంబ్రిడ్జి విద్యాసంస్థల అధిపతి కె.శంతన్ కుమార్ అన్నారు. సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్‌లోని కేం బ్రిడ్జి ఉన్నత పాఠశాలలో కిండర్‌గార్టెన్, ప్రాథమిక తరగతుల విద్యార్థులు ఇంద్రధనుష్ కా హల్ చల్ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అడవిలో వివిధ రంగుల్లో ఉండే జంతువులు, సముద్రంలో భిన్న రంగుల్లోని చేపలు, పలురంగుల్లో ఉండే కూరగాయలు, పండ్లు వంటి వాటిని విధ్యార్థులు నమూనాలతో ప్రదర్శించారు. ఈ సందర్భంగా శంతన్ కుమార్ మాట్లాడుతూ వర్షంకురిసినప్పుడు కనిపించే ఇంద్రధనస్సు అందులోని వర్ణా లు, మనిషికి ప్రకృతిలోని జీవం ఉన్న, జీవం లేని అన్నింటిలోను కనబడు తాయన్నారు. విధ్యార్థులకు ఆలోచనలు రేకెత్తించేలా విద్యావిధానం ఉండాల ని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ, ఉపాధ్యాయులు, సిబ్బంది

## బిఆర్ఎస్‌లో యూత్ కాంగ్రెస్ నాయకుల చేరిక



బిఆర్ఎస్‌లో చేరిన యూత్ కాంగ్రెస్ నాయకులు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ గ్రామానికి చెందిన 16వ డివిజన్ నుండి యువజన కాంగ్రెస్‌కు సంబంధించిన పలువురు యువకులు బిఆర్ఎస్‌లో చేరారు. కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యుడు గుండోజు రఘునందనచారి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డిల ఆధ్వర్యంలో డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డి నిఖిల్, చిత్తాపురం ప్రేమ్, మేకల బాలకృష్ణ, దొడ్డి హరీష్, మేకల పవన్, మేకల రాజశేఖర్, పోచబోయిన మాధవ్ యాదవ్, సాయికిరణ్, పరశురాం, వంశీ, మురారి, అఖిల్, భరత్, రావుల నిఖిల్, వర్షిత్‌రెడ్డిలు బిఆర్ఎస్‌లో చేరగా వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ సొసైటీ డైరెక్టర్ చిగిరింత శ్రీరాంరెడ్డి, కార్పొరేషన్ బిఆర్ఎస్ ఉపాధ్యక్షుడు తిమ్మని గిరీష్, కొప్పుల రాజు, అరవింద్‌గౌడ్, మురళి, వంగేటి అశ్విన్‌రెడ్డి, నితీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలు సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, లక్ష్మణ్ తదితరులు



పూజలు నిర్వహిస్తున్న చేగూరి వెంకట్‌రమణ తదితరులు

**మలక్‌పేట, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :** ఉత్సవాలు సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డిజిల్లాల రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూసారాంబాగ్‌లోని అసోసియేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను శాంతియుతవాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు అమరవాది లక్ష్మినారాయణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఊరె లక్ష్మణ్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలు గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని రజతోత్సవాలను పురస్కరించుకుని ప్రతి రోజు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పొద్దుటూరి రవీందర్, పాల మధుసూదన్, రాముని రామనాథం, నరేష్‌కుమార్‌గోయల్, ఎ.శ్రీనివాస్, పి.శంకర్, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
**భజరంగ్ బలి అసోసియేషన్ ఆధ్వర్యంలో...** మలక్‌పేట మహబూబ్‌మాన్షన్ మార్కెట్‌లో భజరంగ్ బలి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద తెలంగాణ ఆనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపార వేత్త చేగూరి వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణకాంత్, యాదగిరియాదవ్, ప్రకాష్‌యాదవ్, రమేష్, నందుకిషోర్, సాయికిరణ్, వెంకటేష్‌యాదవ్, శివకుమార్, దేవేందర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల పూజలందుకుంటున్న గణనాధులు



పూజలు నిర్వహిస్తున్న చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** వినాయక చవితి పండుగ సందర్భంగా కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో కొలువుదీరిన గణనాధుడు భక్తులపూజలు అందుకుంటున్నాడు. దేవాలయ పాలక మండలి ఛైర్మన్ నల్ల రఘుమారెడ్డి సుమిత దంపతులు బుధవారం గణపతి హోమం, సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి గణనాధుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గోగి అంజిరెడ్డి, చీర తిరుమలేష్, మేక సురేందర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, నాయకులు ముదుపు రాజిరెడ్డి, శేఖర్‌రెడ్డి, వసంత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో ఘనంగా గణేష్ ఉత్సవాలు



వినాయక పండపం వద్ద అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ పన్నాల

**నాచారం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మల్లాపూర్ డివిజన్‌లో ఆయా ప్రాంతాల్లోని గణేష్ మండపాల వద్ద ఘనంగా పూజా కార్యక్రమాలను నిర్వహిస్తూ అన్నాదాన కార్యక్రమాలను చేయిస్తున్నారు. మల్లాపూర్ శ్రీ గణపతి దేవాలయం, నోమ ఆటో స్టాండ్,ఎలిఫెంట్ సర్కిల్ తధితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా హాజరై కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తండా వాసుదేవ్ గౌడ్‌తో పాటు నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి



కార్పొరేటర్ సునీత రామూయాదవ్ దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :** గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో కార్పొరేటర్ మేకల సునీత రామూయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను శాంతియుతవాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేకల రామూయాదవ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రివర్యులు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్‌రెడ్డిని న్యూఢిల్లీలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి వనపర్తి జిల్లా ప్రభారీ, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, నాయకులు బచ్చిగళ్ళ రమేష్, కొండ్రు పురుషోత్తం, ఎంకనోళ్ళ వెంకటేష్, పారంద మహేష్, అంతిగారి నరేష్, మైలారం బాబు తదితరులు (ప్రభాతవార్త, తుర్కయాంజాల్)